చివరికి అన్నదాతకు కడుపుకోతే..!


ముకుందాపురంలో నేలవాలిన సలికంటి సత్యనారాయణ పొలం


కొత్తగూడెంలో నేలవాలిన గడ్డం జాన్‌రెడ్డి వరి

– నిడమనూరు, మాడ్గులపల్లి, న్యూస్‌టుడే:

నిడమనూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరిపైరు నేలవాలింది. మరో పది, ఇరవై రోజులయితే పంటకోసే దశలో పైరు నేలవాలిందని.. మళ్లీ వర్షం వస్తే ఆ ధాన్యం రాలే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా 550 ఎకరాల్లో పంట నేలవాలినట్లు నివేదిక తయారుచేశామని ఏవో మునికృష్ణయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు. కొత్తగూడెం, ఇందుగుల గ్రామాల్లో వరి నేలవాలటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

326 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇప్పటి వరకు 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 326 ప్రారంభించినట్లు డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం హరీశ్‌లు తెలిపారు. నల్గొండ సమీపంలోని ఆర్జాలబాయి, చర్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించి మాట్లాడారు. సన్న వరి ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకంగా 80 కేంద్రాలను ప్రారంభించామని.. ఇప్పటి వరకు 1400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు.

సన్నాల కొనుగోళ్లలో సాంకేతికత

◆ కేంద్రాల్లో పారదర్శకతకు అవకాశం


రేణికుంట శివారులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే :

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా దశలవారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా గతంలో కంటే భిన్నంగా రాష్ట్ర సర్కారు ఈ సారి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించింది. ఇందుకు ప్రత్యేక కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా సాంకేతికత ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటోంది. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత కేంద్రాలకు ఆయా సాంకేతిక పరికరాలు వచ్చి చేరాయి. వీటి ద్వారా సన్నరకం ధాన్యం తేమ, తాలు, గింజల పరిమాణం తదితర అంశాలను సులువుగా తెలుసుకునే వీలు కలుగుతుంది.

గింజలు తీయడానికి 'ప్యాడి హస్కల్'..

శాఖాపరంగా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు ప్యాడి హస్కల్ యంత్రాలను అందజేయనున్నారు. గుప్పెడు వడ్లు తీసుకుని ఈ యంత్రంతో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకు వస్తాయి. ఈవిధంగా బయటకు వచ్చిన బియ్యం గింజలను గ్రెయిన్ కాలిపర్ యంత్రంలో పోసి సన్నరకం బియ్యం అవునో.. కాదో.. తెలుసుకునే వీలు కలుగుతుంది.

'గ్రెయిన్ కాలిపర్'తో గుర్తింపు..

సన్నధాన్యం గుర్తించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రో మీటర్) యంత్రం అందజేస్తున్నారు. ఈ యంత్రం సాయంతో సన్నబియ్యం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ కంటే తక్కువ ఉండాలని ప్రమాణాలు నిర్దేశించారు. ఈ యంత్రం వినియోగంపై కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే అవగాహన కల్పించినట్లుగా సంబంధిత అధికారవర్గాలు వెల్లడించాయి.

సంచులపై కోడ్..

ధాన్యం సంచులపై కొనుగోలు కేంద్రం కోడ్, ధాన్యం రకం వివరాలు నమోదు చేస్తారు. సన్న రకమైతే ఎరుపు రంగుతో కొనుగోలు కేంద్రం నంబరు, ధాన్యం రకం వద్ద 'ఎస్' అని రాస్తారు. దొడ్డు రకం సంచులపై ఆకుపచ్చ రంగుతో కొనుగోలు కేంద్రం నెంబరు, ధాన్యం రకం వద్ద 'డీ' అని రాస్తారు. సన్న రకాన్ని సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యం సాగు వివరాలు ఎకరాల్లో.. (అంచనా)

సన్నరకం సాగు	జిల్లా	దిగుబడి
2,42,490	నల్గొండ	5,81,975
3,41,650	సూర్యాపేట	8,15,960
97,028	యాదాద్రి	1,74,650

సంబంధిత రైతుల ఐరిస్..

రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని, వాటిని కొనుగోలు కేంద్రాల్లో భారీగా విక్రయిస్తుంటారు. దీన్ని నిలువరించేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానం అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు కేంద్రానికి వచ్చే వారి వివరాలను నిర్వాహకులు నమోదు చేసి, చరవాణికి ఓటీపీ పంపించేవారు. ధాన్యం విక్రయ సమయంలో మరోసారి ఓటీపీ పంపి ట్రక్‌షీట్‌ను కేటాయించిన మిల్లులకు పంపేవారు. ఈసారి ముందుగా రైతు వివరాలు నమోదు చేసుకుని ఓటీపీ పంపి, విక్రయ సమయంలో సంబంధిత రైతు ఐరిస్ తీసుకోనున్నారు.

ఈ రకాలకే పంట బోనస్

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు రైతుల్లో ఉన్నాయి. సర్కారు గుర్తించిన సన్నరకం వంగడాలు ఇవే.

సాంబమసూరి(బీపీటీ-5204)	జగిత్యాల సన్నాలు(జేజీఎల్-1798)
సిద్ధి(డబ్ల్యూజీఎల్-44)	జగిత్యాల సాంబ(జేజీఎల్3844)
కంపసాగర్-1(కేపీఎస్-2874)	కరీంనగర్ సాంబ(జేజీఎల్-3855)
జగిత్యాల-3(జేజీఎల్--27356)	అంజన(జేజీఎల్-11118)
జగిత్యాల-2(జేజీఎల్-28545)	నెల్లూరు మసూరి(ఎన్ఎల్ఆర్-34449)
వరంగల్ సాంబ(డబ్ల్యూజీఎల్-14)	ప్రత్యూమ్న(జేజీఎల్-17004)
వరంగల్ సన్నాలు(డబ్ల్యూజీఎల్-32100)	సుగంధ సాంబ(ఆర్ఎన్ఆర్-2465)
జగిత్యాల మసూరి(జేజీఎల్-11470)	శోబిని(ఆర్ఎన్ఆర్-2354)
పలాస ప్రభ(జేజీఎల్-384)	సోమనాథ్(డబ్ల్యూజీఎల్-347)
కృష్ణ (ఆర్ఎన్ఆర్-2458)	ఆర్ఎన్ఆర్-31479(పీఆర్సీ)
మానేరు సోనా(జేజీఎల్-3828)	కె.పి.ఎస్-6251(పీఆర్సీ)
తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్-15048)	జేజీఎల్-33124(పీఆర్సీ)
వరంగల్ వరి-1119	హెచ్ఎంటీ సోనా
కూనారం వరి-2(కేఎల్ఎం-1638)	మారుటేరు సాంబ(ఎంటీయూ-1224)
వరంగల్ వరి-2(డబ్ల్యూజీఎల్-962)	మారుటేరు మసూరి(ఎంజీయూ-1262)
రాజేంద్రనగర్ వరి-4(ఆర్ఎన్ఆర్-21278)	ఎంటీయూ-1271
కూనారం వరి-1(కేఎల్ఎం-733)	

ఉన్నతి లేనట్టేనా..!

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో భాగంగా వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని యువతకు ఉన్నతి కార్యక్రమం ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుంది. జిల్లాలో 2018-19 సంవత్సరానికి సంబంధించి వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని యువతకు మాత్రమే శిక్షణ అందించి చేతులు దులుపుకొన్నారు. అప్పటి నుంచి నాలుగేళ్లుగా ఉన్నతి శిక్షణ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ గ్రామీణ యువత నిరాశలో ఉన్నారు.


డీఆర్‌డీవో కార్యాలయంలో మూతపడిన యువత నైపుణ్య శిక్షణ కేంద్రం

ఎంతగానో ప్రయోజనం

ఉన్నతి కార్యక్రమం అమలు చేస్తే జిల్లాలోని యువతకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. కార్యక్రమం ద్వారా అందించే 90 రోజుల శిక్షణలో భాగంగా ఉచిత భోజనం, వసతితో పాటు రోజుకు రూ. 300 ఉపకార వేతనం అందించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉండి వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని వివాహం కాని నిరుద్యోగ యువతకు ఉన్నతి కార్యక్రమం ద్వారా వివిధ రంగాల్లో రాణించేలా నైపుణ్య శిక్షణ అందిస్తారు.


■ పదోతరగతి, ఇంటర్, డిగ్రీ తదితర ఉన్నత విద్య పూర్తి చేసిన వారికి స్కిల్డ్ విభాగంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, నైపుణ్యం, కంప్యూటర్, ఎంఎస్ ఆఫీస్, టైపింగ్, బేసిక్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్, నిరక్షరాస్యులకు అన్‌స్కిల్ విభాగంలో వర్మీ కంపోస్టు తయారీ, పాడి, వ్యవసాయం, పుట్టగొడుగుల సాగు, టైలరింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, తదితర రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను కల్పించాల్సి ఉంది.

ఏళ్లుగా ఎదురుచూపులే..

జిల్లా వ్యాప్తంగా 33 మండలాల్లో 868 గ్రామ పంచాయతీలు ఉండగా పథకంలో భాగంగా 3,53,021 జాబ్ కార్డులు, అందులో 7,59,880 మంది కూలీలు ఉన్నారు. 2018-19 సంవత్సరానికి సంబంధించి వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని యువతకు మాత్రమే నైపుణ్య శిక్షణ అందించారు. ఆ తర్వాత 2019-20 నుంచి ఇప్పటి వరకు వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన కుటుంబాల్లోని యువతకు శిక్షణ అందచేయకుండా గాలికి వదిలేశారు.

పట్టింపులేని అధికారులు

నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉన్న సంబంధిత డీఆర్‌డీవో అధికారులు నిర్లక్ష్యంతో పట్టించుకోకపోవడంతో ఆయా కుటుంబాల్లో నిరుద్యోగ యువతకు ఎదురుచూపులు తప్పడం లేదు. శిక్షణకు నిధులు విడుదల చేయడం లేదని, యువత ముందుకు రావడంలేదనే కుంటి సాకులు చెబుతూ కాలం వెల్లబుచ్చుతున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ విషయంపై ఏపీడీ లక్ష్మీనర్సింహారావును వివరణ కోరగా.. ఎస్‌బీఐ అందించే శిక్షణకు యువతను పంపుతున్నట్లు తెలిపారు.



గడిచిన మూడేళ్లలో జిల్లాలో శిరస్త్రాణం లేకుండా మృతి చెందిన వారి వివరాలు..

శిరస్త్రాణం ధరించు మిత్రమా..



జిల్లాలో ఇటీవల కొత్త హంగులతో కూడిన ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయి. యువత వీటి పట్ల ఆకర్షితులై అధిక వేగంతో ప్రయాణిస్తున్నారు. ద్విచక్ర వాహనం వాడుతున్న వంద మందిలో 95 నుంచి 98 శాతం వరకు శిరస్త్రాణం(హెల్మెట్) వాడని వారే ఉంటున్నారు. ఇందులో 95 శాతం మంది 18 నుంచి 35 ఏళ్లలోపు వారే. ప్రతి ఒక్కరు విధిగా శిరస్త్రాణం ధరించాలి. దీనివల్ల ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చు. శిరస్త్రాణం ఉపయోగించని వారిపై రూ.1,000 వరకు జరిమానాతో పాటు చర్యలు తీసుకుంటాం. – శరత్‌చంద్ర పవార్, ఎస్పీ

- నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే:

పత్తి మద్దతు ధర రూ.7,521: కలెక్టర్

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: పత్తి రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,521 కన్నా తక్కువకు అమ్ముకోవద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లిలో ఉన్న పత్తి మిల్లును ఆకస్మికంగా సందర్శించారు. పత్తిని ఆరబెట్టి తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ అధికారులను ఆదేశించారు. ఈనెల 26 వరకు వర్షాలు ఉన్నాయని.. అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. నల్గొండ జిల్లాలో 22 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఐకేపీ, నార్కట్‌పల్లిలోని పీఏసీఎస్ కేంద్రాలను సందర్శించారు. సీపీవో కృష్ణారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ హరీశ్, మార్కెటింగ్ అధికారి ఛాయదేవి, తహసీల్దార్ వెంకటేశ్వర్లరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సుధాకర్ పాల్గొన్నారు.


వరలక్ష్మి పత్తి మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు సాధించేందుకు పురపాలికలు దృష్టి సారిస్తున్నాయి. గతంలో కంటే మెరుగ్గా రాణించేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ప్రజలకు సూచించినా.. పురపాలికల్లో 40 నుంచి 50 శాతమే ఇలా ఇస్తున్నారు. తద్వారా ఉత్తమ ర్యాంకుల సాధనలో వెనుకబడిపోతున్నారు. ఈ ఏడాది అలాంటి విధానానికి భిన్నంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి డిసెంబరు వరకు కొనసాగనున్నాయి.



స్వచ్ఛసర్వేక్షణ్ లో భాగంగా సూర్యాపేటలోని సద్దుల చెరువు వద్ద స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్యకళాశాల విద్యార్థులు

వార్డుల వివరాలు (పురపాలికలు / వార్డులు)

జిల్లా	పురపాలికలు	వార్డులు
సూర్యాపేట	5	141
నల్గొండ	8	171
యాదాద్రి	6	104

డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు. పురపాలికల్లోని ప్రధాన రోడ్ల వెంబడి హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారేయకుండా అవగాహన కల్పిస్తారు. పరిసరాల శుభ్రతపై పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వార్డుల వారీగా కార్యక్రమాలు..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో 419 వార్డుల వారీగా ఇక నుంచి చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరుచేయాలో ప్రత్యేకంగా చూపించనున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక డబ్బాలో వేయాలని సూచించనున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టలు ఇతర పొడి వ్యర్థాలను మరో డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు.

మెరుగైన ర్యాంకు సాధనకు కృషి..

– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ సారి అవార్డు వచ్చేలా కృషి చేస్తాం. గతంలో కంటే మెరుగైన ర్యాంకు సాధించి సూర్యాపేట పురపాలికను రాష్ట్రస్థాయిలో నిలుపుతాం. పట్టణ ప్రజలు కూడా చెత్త విషయంలో నిబంధనలు పాటించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే ర్యాంకు తప్పక వస్తుంది.

ప్రజల పక్షాన పోరాటం: భారాస


మాట్లాడుతున్న భారాస జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, చిత్రంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పెద్దలు ఏం ఆశించి రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమకు అనుమతి ఇచ్చారో చెప్పాలని భారాస జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్‌లతో కలిసి మాట్లాడారు. పచ్చటి పొలాలతో ఉన్న ప్రాంతాల్లో కాలుష్య కాసారం చేయాలని చూస్తున్నారని ఎట్టి పరిస్థితుల్లో ఇది జరగనివ్వమన్నారు. ప్రజల పక్షాన ఎంతవరకైనా పోరాడుతామన్నారు. మాజీ ఎమ్మెల్యేలతో పాటు ప్రొటోకాల్ ఉన్న ప్రజాప్రతినిధులను ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా అడ్డుకోవడం, ముందస్తు అరెస్టులు చేయడం సరికాదన్నారు. మూసీ కాలుష్యంపై మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డిలు ఇప్పుడు కనిపించకుండా పోయారని అన్నారు. వారు ఈ ప్రాంత ప్రజల మంచి కోరేవారైతే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయించాలని అన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్నానంటూ చెప్పే నాయకులు సైతం ఫ్యాక్టరీ అనుమతులపై మాట్లాడటం లేదని విమర్శించారు. భారాస రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, మాజీ ఆర్వో శరణ్యారెడ్డి, సైదిరెడ్డి, శ్రీనివాస్, దేవేందర్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి.. అంతా ఉత్తుత్తి..!



డిండి మండలకేంద్రంతోపాటు చెర్కుపల్లిలో 140 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ విత్తనోత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ గతంలో వరి, వేరుసెనగ, కంది, ఆముదం పంటలను సాగు చేసేవారు. కానీ రెండేళ్ల నుంచి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో విత్తనాల ఉత్పత్తి జరగడం లేదు. దీంతో కేంద్రంలో ఏపుగా ముళ్లకంపలు పెరిగాయి. వాటిని తొలగించే నాథుడే కరవయ్యారు. క్షేత్రాన్ని ఏడీఏ, ఏవో, ఏఈవో నిరంతరం పర్యవేక్షించాల్సి ఉన్నా మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఏవో నాగేశ్వర్‌రావును వివరణ కోరగా.. గతేడాది రబీ సీజన్ నుంచి బ్రిడర్ సీడ్ ఇవ్వడం లేదని, ఈ ఏడాది 40 ఎకరాలు వేరుసెనగ, 50 ఎకరాలు వరి సాగు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, డిండి

ఫీజు రీయింబర్స్‌మెంట్

విడుదల చేయాలని ధర్నా

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.6500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. బరిగల వెంకటేష్, ఆంజనేయులు, మురళీకృష్ణ, శోభన్‌నాయక్, సూర్యతేజ, వినయ్, శివకుమార్ మహేందర్, భాను, మనోజ్, శ్రీధర్, రవితేజ, మాధవి, లక్ష్మీ, స్వాతి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

కొనసాగుతున్న పటాలం

కుటుంబ సభ్యుల ఆందోళన

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం సమీపంలోని 12వ పటాలంలో కింది స్థాయి సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఆరుగురు సిబ్బందిని అధికారులు విధుల నుంచి తొలగించారు. వారిని తిరిగి చేర్చుకోవాలని బుధవారం కమాండెంట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రూరల్ ఎస్సై సైదాబాబ సిబ్బందితో వెళ్లి ఆందోళనకారులను విరమింపజేశారు. సిబ్బందికి న్యాయం జరిగేలా చూస్తామని ఉన్నతస్థాయి అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిసింది.


పటాలం కమాండెంట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సిబ్బంది కుటుంబ సభ్యులు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయం

'న్యూస్‌టుడే'తో ఎంజీయూ వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్

ముఖాముఖి



నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారు ఉపాధి అవకాశాలు, ఉన్నత ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తామని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. తాను ఇక నుంచి వర్సిటీలోనే నివాసం ఉండి విశ్వవిద్యాలయ పురోగతికి తోడ్పడుతానని తెలిపారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం పరిపూర్ణంగా ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో వర్సిటీలో అన్ని విభాగాలపై సమీక్షలు జరిపి ఏమైనా లోపాలు ఉంటే వాటిని సవరిస్తామని పేర్కొన్నారు. ఇటీవల నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'న్యూస్‌టుడే'తో పలు విషయాలను పంచుకున్నారు..

బయోమెట్రిక్ పక్కాగా అమలు..

విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం పక్కాగా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టనున్నాం. అధ్యాపకులు, విద్యార్థుల హాజరును మెరుగుపర్చేందుకు ఈ విధానం అమలు చేస్తున్నాం. విద్యార్థుల హాజరు 75శాతం కన్నా తక్కువగా ఉంటే వారిని పరీక్షలకు అనుమతించబోం.

విద్యార్థుల స్కిల్స్ పెంపుపై దృష్టి..

విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాలను నేర్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నాం. ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడటం, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా మనోధైర్యం కల్పించడం, వ్యక్తిగత సామర్థ్యాలు, బృందాన్ని నడిపించగల నైపుణ్యం, సాంకేతిక, విజ్ఞాన అంశాలు, తదితర ఎన్నో రకాల స్కిల్స్‌పై నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పిస్తాం. ఆయా కంపెనీలతో సంప్రదింపులు చేస్తూ వారు విద్యార్థుల నుంచి ఏ నైపుణ్యాలు కోరుకుంటున్నారో తెలుసుకుని..అవే అంశాలను నేర్పించి కొలువులు సాధించేలా ప్రయత్నాలు చేస్తాం.

పరిశోధనలకు ప్రాధాన్యం..

వర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకుల పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. వర్సిటీలో ఇప్పటి వరకు సుమారు 33 మంది ఆయా సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ఈ విద్యా సంవత్సరం వివిధ సబ్జెక్టుల్లో 62 మందికి అడ్మిషన్ ఇచ్చాం. ఇటీవల పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యింది. భవిష్యత్తులో ఎంజీయూ నుంచి పీహెచ్‌డీ పట్టాలు పొందే వారి సంఖ్య మరింత రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

నేను వర్సిటీలో ఉంటా...

విశ్వవిద్యాలయంలోని వీసీ రెసిడెన్సీలో నేను నివాసం ఉంటున్నాను. నిర్మాణం పూర్తయిన స్టాఫ్ క్వార్టర్స్‌లో అధ్యాపకులు ఉండేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాను. నేను స్థానికంగా ఉండడం ద్వారా వర్సిటీలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటుగా వర్సిటీ అభివృద్ధి చేసుకునేందుకు మంచి అవకాశంగా భావించవచ్చు.

పోస్టుల భర్తీకి ప్రయత్నిస్తాం..

ఎంజీయూలో గత కొన్నేళ్లుగా అధ్యాపక పోస్టులు సగం ఖాళీగా ఉన్నాయి. బోధనేతర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఖాళీలు ఉన్నా విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తూనే...వర్సిటీని అభివృద్ధి వైపు నడిపిస్తున్నాం. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

యువ తేజం.. సేవా పథం

రామన్నపేట, న్యూస్‌టుడే:

సేవా పథం మా లక్ష్యం అంటున్నారు పలువురు యువకులు. చదువుతూ.. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ సేవా మార్గం వైపు దృష్టి సారించారు. స్నేహితులతో కలిసి యువజన సంఘాలను ఏర్పాటు చేయడం, స్థాపించిన సేవా సంస్థల్లో సభ్యులుగా చేరడం ద్వారా ఆయా సంస్థల కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. పేదల ఆకలి తీరుస్తూ, ఆర్థికంగా చేయూతనిస్తూ.. ఆధ్యాత్మిక సేవలు చేస్తూ ముందుకు సాగుతున్న పలువురు యువకులపై కథనం.

ఆకలి తీరుస్తున్న ఆపద్బాంధవులు

దయనీయ స్థితిలో ఉన్న పేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంతో పోలీస్ ఉద్యోగి జబ్బు వెంకటేశ్ ఆపద్బాంధవులు ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. సంస్థ లక్ష్యాన్ని తెలుసుకున్న మండలంలోని కక్కిరేణి తదితర గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఇందులో సభ్యులుగా చేరారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వారితో పాటు నిరుపేదల సమాచారం తెలుసుకుని వారి కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు, కొంత ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. ఇప్పటి వరకు దుబ్బాక, వెల్లంకి, నీర్నెంల, లక్ష్మాపురం, పల్లివాడ, మునిపంపుల తదితర గ్రామాల్లో 25కి పైగా కుటుంబాలకు సాయం అందించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

ఆర్థికంగా చేయూతనిస్తూ...



నీర్నెంలలో ఆర్థికసాయం అందజేస్తున్న జాంబవ మహాసేన సభ్యులు

నీర్నెంలలో కొందరు యువకులు జాంబవ మహాసేన అనే సేవా సంస్థను 2021లో ఏర్పాటు చేశారు. 74 మందితో ప్రారంభమైన ఈ సంస్థలో ప్రస్తుతం 139 మంది సభ్యులు ఉన్నారు. సొంతంగా నిధులు సమకూర్చి పిల్లలు లేని వృద్ధులు, పేదరికంతో ఇబ్బందులు పడుతున్న వారు, అనారోగ్యంతో గురై చికిత్స పొందుతున్న వారిని గుర్తించి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ముందుకు వస్తున్నారు. రూ.10 వేలు నుంచి రూ.20వేలకు పైగా ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు రామన్నపేట, నీర్నెంల తదితర గ్రామాల్లో పదికి పైగా కుటుంబాలకు రూ.2లక్షలకు పైగా ఆర్థిక సాయాన్ని అందించామని సంస్థ సభ్యుడు నోముల యాదగిరి పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా..



రామన్నపేటలో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న అన్నప్రసాద కమిటీ సభ్యులు

రామన్నపేట, నీర్నెంల, వెల్లంకి, సిరిపురం, బోగారం తదితర గ్రామాల్లో యువకులు సంఘాలను ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక్కో సంఘంలో 20మందికి పైగా సభ్యులున్నారు.

సేవల్లో ముందుండి.. వాసవీక్లబ్ గవర్నర్‌గా ఎదిగి



విజయలక్ష్మి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: వాసవీ, వనితాక్లబ్‌ల ద్వారా జరిగే సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తూ అనతికాలంలో క్లబ్‌లో అంచెలంచెలుగా ఎదిగారు నేరేడుచర్లకు చెందిన రాచకొండ విజయలక్ష్మి. ఆమె సేవలను గుర్తించి ఇటీవల మట్టపల్లిలో జరిగిన వాసవీక్లబ్ 104 రీజియన్ సమావేశంలో ఆమెను గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు వాసవీ, వనితాక్లబ్‌ల ద్వారా పేదల కోసం నిర్వహించిన పలు సేవాకార్యక్రమాలకు రూ.10 లక్షలకు పైగా, వృద్ధాశ్రమానికి రూ.2 లక్షలు అందించినట్లు చెప్పారు. అప్పట్లో ఆటో మొబైల్ షాపు నిర్వహణలో పట్టు సాధించడంతో ఆర్యవైశ్య మహాసభ 2019లో ఆమెకు ఉత్తమ మహిళా వ్యాపారవేత్త అవార్డును అందించి సత్కరించింది. పేద విద్యార్థులకు, నిరుపేద మహిళలకు సాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల నిర్వహణకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

☛ విజయలక్ష్మి వాసవీక్లబ్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. వాసవీక్లబ్ వైస్ గవర్నర్‌గా, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా, డిస్ట్రిక్టు క్యాబినెట్ కోశాధికారిగా, రీజియన్ ఛైర్మన్‌గా, జోన్‌ఛైర్మన్‌గా, నేరేడుచర్ల వాసవీ వనితాక్లబ్ తొలి అధ్యక్షురాలిగా పని చేశారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షురాలిగా, కార్యదర్శిగా పనిచేశారు. వైశ్యగురు సేవారత్న అవార్డును ఆమె అందుకోవడం విశేషం. ☛ రీజియన్‌లోని వాసవీ, వనితాక్లబ్‌ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

పర్యాటకుల్ని బుద్ధవనానికి తీసుకురండి: పటేల్ రమేశ్‌రెడ్డి



ట్రావెల్ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: బుద్ధగయ నుంచి బౌద్ధ పర్యాటకులను సాగర్‌లోని బుద్ధవనానికి తీసుకురావాలని పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఏటీటీవో ఆధ్వర్యంలో బుద్ధగయలో నిర్వహించిన టూర్స్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. మాట్లాడారు. ఆచార్య నాగార్జునుడు నడయాడి, మహాయన బౌద్ధాన్ని ప్రచలితం గావించి మాధ్యమిక బౌద్ధ తార్కిక విధానాన్ని ప్రచారం చేసిన ప్రాంతం నాగార్జునసాగర్ అన్నారు. అలాంటి ప్రాంతంలో బౌద్ధ సంస్కృతిని ఈ తరానికి తెలియజేయడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి పర్యాటకులను తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం బుద్ధవనం గురించి బుద్ధిస్ట్ నిపుణుడు ఈమని శివనాగిరెడ్డి ట్రావెల్ ఏజెంట్లకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఏటీటీవో జనరల్ సెక్రటరీ హంసహాలిడేస్ అధినేత కౌలేష్ కుమార్ బుద్ధగయ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోండి



వాలీబాల్ ఆడి క్రీడలు ప్రారంభిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థినులు పాఠశాల స్థాయి నుంచే క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. మండల పరిధిలోని శ్రీనివాసనగర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల గురుకులాల సొసైటీల ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి క్రీడాపోటీలు దామరచర్ల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఆయన బుధవారం ముఖ్యఅతిథిగా వచ్చి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు గురుకులాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ సరిత, విశ్రాంత ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, పీడీ ఇందిరా, పీఈటీ శాంతి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ తొలిరోజు షాట్‌పుట్, డిస్క్ త్రో, కబడ్డీ, ఖో-ఖో క్రీడా పోటీలు నిర్వహించగా.. షాట్‌పుట్, డిస్క్‌త్రో పూర్తయ్యాయని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

విజేతల వివరాలు..

షాట్‌పుట్: సీహెచ్. శ్రావ్య, అనంతగిరి పాఠశాల (మొదటి స్థానం), ఎ.అక్షిత, గుడుగుండ్లపాలెం పాఠశాల (ద్వితీయ).

డిస్క్‌త్రో.. కె.కీర్తి, అప్పాజీపేట పాఠశాల (మొదటి స్థానం), కె.సువార్త, సింగిరెడ్డిపాలెం పాఠశాల (ద్వితీయ).

పల్లెవించిన పంట..!



సేంద్రియ పద్ధతిలో కాసిన కూరగాయలను చూపిస్తున్న యువరైతు భరత్‌రెడ్డి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: చదివింది వ్యవసాయ డిప్లొమా. ఉన్నత చదువులకు అమెరికాలో అడ్మిషన్ వచ్చింది. రూ.కోటి వరకు ఖర్చు వచ్చేలా ఉండటంతో అంత భారం కుటుంబంపై వద్దనుకున్నాడు. ఇదే అర్హతతో హైదరాబాద్‌లోని ఒక వ్యవసాయ క్షేత్రం మేనేజరుగా కుదిరాడు. ఉద్యోగంలో ప్రవేశించిన నెల రోజుల్లోనే చేదు అనుభవం ఎదురవడంతో ఇంటిదారి పట్టాడు. తమ భూమిని కాపాడుకుంటూనే ఆర్థిక వనరులు సృష్టించుకోవాలని సంకల్పించాడు. ఆ దారిలోనే ముందడుగు పడింది. అంతేకాదు.. తనలాగా ఎవరైనా సేంద్రియ సాగుపై ఆసక్తి చూపితే.. వారికీ ఉచితంగా శిక్షణనిప్పిస్తానంటున్న ఈ యువకుడి పేరు పల్లె భరత్‌రెడ్డి. స్వగ్రామం చింతలపాలెం.

ప్రయాణం సాగిందిలా..

సాగు పద్ధతులపై పట్టుకోసం ఒక క్షేత్రంలో ఉద్యోగంలో చేరా. అక్కడ వీడియోలు తీస్తుంటే ఉద్యోగం నుంచి తొలగించారు. పట్టణాల్లో మాదిరి మా ఇంటి దగ్గర సేంద్రియ వ్యవసాయంతో సంపాదించుకోవచ్చని ఇంటికొచ్చా. అరెకరంలో ప్రయోగాత్మకంగా కూరగాయల తోట వేశా. బావుంది. ప్రస్తుతం దొండ, ఎర్రబెండ, వంగ, సొర, బీర, పచ్చిమిర్చి పండిస్తున్నా. రెండ్రోజులకొకసారి పది కిలోల దిగుబడి వస్తుంది. ఏరోజుకారోజు కోసి వాట్సప్ గ్రూప్‌లో పెట్టగానే ఆర్డరొస్తుంది. అలవాటయ్యేందుకు హోం డెలివరీ ఇస్తున్నా. ఐదారు కిలోలైతే పది కిలోమీటర్ల వరకు వెళ్లి ఇస్తున్నా. పొలం దగ్గరకూ వచ్చి తీసుకెళ్తున్నారు. ఏవైనా మార్కెట్ ధరకే ఇస్తున్నా.



కూరగాయల తోటలో సొర, బీరకాయలు

సొంతూళ్లోనే ఉద్యోగంలా..

మా ఇంట్లో ఆవులు ఉన్నాయి. తోటలో మొక్కల ఎదుగుదలకు ఎరువుగా ఆవు పేడ వాడతా. ఇంకా డైరెక్టర్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ వారు తయారు చేసిన వేస్ట్ డీకంపోజరును తెచ్చుకున్నా. దాన్ని నీళ్లలో కలుపుకొని ఐదు రోజులు నిల్వ చేసి మొక్కల తొలి దశలో దాన్ని స్ప్రే చేస్తుంటా. నాణ్యమైన దిగుబడికి ఆవు పేడతోనే తయారు చేసిన ఘన జీవామృతాన్నీ వాడతా. తెగులు వస్తే నీమాస్త్రం చల్లుతా. సొంతూళ్లోనే ఉద్యోగంలాగా ఇలా సాగు చేసుకోవచ్చు. భూమిని రసాయనాల బారి నుంచి కాపాడుకోవచ్చు. ఆదాయం కూడా లభిస్తుంది. నేనూ ఈ లక్ష్యంతోనే చేస్తున్నా. ఫ్రెండ్స్ ఆర్గానిక్ ఫాం అని సామాజిక మాధ్యమ ఛానల్‌ను పెట్టా. నాలాంటి వారికి ఉచితంగానే శిక్షణనిప్పిద్దామనేది ఉద్దేశం.

నవంబరు మొదటి వారంలో బస్సు యాత్ర: జాజుల

నీలగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కులగణన పూర్తి చేసేవరకు పోరాటం ఆపబోమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం బీసీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులగణనను ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నవంబరు మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. కులగణనతోనే బీసీల భవిష్యత్తు ఉందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జీవో 29తో బీసీలకు మరింత నష్టం ఏర్పడిందన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చక్రహరి రామరాజు, నేలపట్ల సత్యనారాయణ, శంకర్, రాములు, శంకరయ్యగౌడ్, భిక్షమయ్య, మధుయాదవ్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్



గవర్నర్ కలిసిన ఎంజీయూ వీసీ ప్రొ.అల్తాఫ్ హుస్సేన్, చిత్రంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం

గవర్నర్‌ను కలిసిన ఎంజీయూ వీసీ

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ బుధవారం హైదరాబాద్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంజీయూలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. వర్సిటీని మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తామని ఆయనకు తెలిపారు. వీసీ వెంట తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఉన్నారు.

ఎన్జీ కళాశాల పీజీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నాగార్జున ప్రభుత్వ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్, ఒకటో, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫలితాలను బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ ఉపేందర్, పరీక్షల నియంత్రణ అధికారి బి. నాగరాజు విడుదల చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్న అధ్యాపకులను అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించి కళాశాలను ఆదర్శప్రాయంగా మార్చాలని కోరారు. ఎమ్మెస్సీ జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, ఎంకాం, ఎంఏ తెలుగు, అర్థశాస్త్రాలకు సంబంధించిన ఫలితాల వివరాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ప్రసన్నకుమార్, వెల్దండి శ్రీధర్, రవికుమార్ పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ ఉపేందర్, సీవోఈ నాగరాజు, తదితరులు

సాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల నిలిపివేత

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదలను ఎన్నెస్పీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిపివేశారు. సాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న డ్యాం నుంచి వచ్చిన వరదనీటి కారణంగా ఎన్నెస్పీ ఈ నెల 16వ తేదీ నుంచి 23వ తేదీ అర్ధరాత్రి వరకు సాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ఎన్నెస్పీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు శ్రీశైలం నుంచి 78.4 టీఎంసీల వరదనీరు సాగర్ జలాశయానికి చేరగా క్రస్టుగేట్ల ద్వారా 53 టీఎంసీ, కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్‌కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా 25.7 టీఎంసీలు మొత్తం 80.77 టీఎంసీ నీటిని విడుదల చేయగా ప్రస్తుత జలాశయ నీటిమట్టం 589.40 అడుగుల వద్ద ఉంది.

భూ వివాదంలో అన్నను హత్య చేయించిన తమ్ముడు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: భూ వివాదంతో సొంత అన్నను తమ్ముడు సుపారి గ్యాంగ్‌తో కిరాతకంగా హత్య చేయించిన ఘటన నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం నారాయణపురం గ్రామంలో ఈ నెల 16న చోటు చేసుకున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

★ గ్రామానికి చెందిన కాకునూరి నరసింహకు ముగ్గురు కుమారులు లింగయ్య, కొండయ్య(64), శ్రీను ఉన్నారు. 20 ఏళ్ల క్రితం కొండయ్య, శ్రీను కలిసి అన్న లింగయ్య పేరుతో ఆరు ఎకరాల భూమిని కొనుగోలు చేసి పట్టాచేశారు. కొద్దిరోజుల క్రితం లింగయ్య మరణించగా అతడి పేరిట ఉన్న భూమిని కాకునూరి శ్రీను పట్టా మార్పిడి చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొండయ్య గ్రామ పెద్దలు, బంధువుల వద్ద పంచాయితీ పెట్టించారు. దీంతో కాకునూరి శ్రీను తన అన్న కొండయ్యను అడ్డు తప్పించుకోవాలని భావించి పాత నేరస్థులు వేముల నాగరాజు, పందిరి లింగస్వామిలను సంప్రదించి రూ.5 లక్షలకు హత్యచేసేలా సుపారి ఇచ్చాడు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్సై కృష్ణయ్య

★ సుపారి గ్యాంగు సభ్యులు కొద్దిరోజులుగా కొండయ్య కదలికలపై రెక్కీ నిర్వహించి ఈనెల 16న ఇంట్లో ఉన్న కొండయ్యను కత్తితో పొడిచి ఆటోలో ఎక్కించుకుని పోతుండగా గ్రామస్థులు అడ్డుకోగా అక్కడే కొండయ్యను పడేసివెళ్లారు. ఈ నెల 22న పోలీసులు హత్య కేసు నిందితులు కాకునూరి శ్రీను, వేముల నాగరాజు, పందిరి లింగస్వామి, చీరాల సురేష్, జిట్టబోయిన వెంకన్నలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద ఆటో, 5 చరవాణులు, రూ.15వేల నగదు, కత్తి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపుతున్నామన్నారు. నేరస్థులను అదుపులోకి తీసుకున్న సీఐ వీరబాబు, ఎస్సై కృష్ణయ్య సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



విద్యార్థులకు తుపాకీపై అవగాహన కల్పిస్తూ..



పోలీస్ డాగ్‌కు ఆహారం అందిస్తున్న విద్యార్థిని

ఆయుధాలు పరిశీలిస్తూ.. డాగ్‌ను లాలిస్తూ

పోలీసులు వాడే ఆయుధాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్‌లో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పోలీస్ ఆయుధాలు, బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం, కమాండ్ కంట్రోల్, సీసీ కెమెరాలు, మాదక ద్రవ్యాల కిట్లపై అవగాహన కల్పించారు. డీఎస్పీ రమేశ్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ సంతోశ్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నల్గొండ అర్బన్

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వేధింపులకు గురి చేశారు. ఈనెల 12న సదరు బాలిక పాఠశాలకు వెళ్తున్న సమయంలో ముగ్గురు యువకులు అడ్డుకొని వీడియోలు చిత్రీకరించి బెదిరింపులకు పాల్పడ్డారు. బాలిక నుంచి రూ.700 నగదును చోరీ చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

పశువుల వాహనం పేరిట వసూళ్లు..!

కోదాడ, న్యూస్‌టుడే: పశువులను అక్రమంగా కబేళాకు తరలిస్తుంటే ఆ వాహనాన్ని అడ్డుకొని సీజ్ చేసి పశువులను రక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. కానీ కొందరు పోలీసులు సంపాదనే ధ్యేయంగా పశువుల వాహనాన్ని పట్టుకొని అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన ఇటీవల కోదాడ డివిజన్ పరిధిలో చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని ఓ పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో రాత్రి సమయంలో పోలీసులు వాహనంలో గస్తీ కాస్తున్నారు. అదే సమయంలో వాహనంలో కొందరు పశువులను తరలిస్తుండగా వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేయాల్సిన పోలీసులు వ్యాపారులతో బేరసారాలు ఆడినట్లు తెలిసింది. సీజ్ చేయకుండా రూ.లక్ష వరకు వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. దాంట్లో రూ.30 వేలు ఆన్‌లైన్ విధానంలో చెల్లించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఈ దందా ఎప్పటి నుంచో జరుగుతుందని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటేనే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

కులాంతరాలు లేని సమాజం కావాలి

నీలగిరి, న్యూస్‌టుడే: ఇద్దరు మనుషులు ఇష్టపడి కలిసి జీవిస్తామని చేసుకున్న ఒప్పందమే వివాహమని మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు బైరి నరేశ్ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కులాంతర వివాహాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదర్శ వివాహం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వివాహ బంధాన్ని కులంతో ముడిపెట్టి మానవ సంబంధాలలో అంతరాలు సృష్టిస్తున్నారని. కులాంతరాలు లేని సమాజం నిర్మితమవ్వాలని అభిప్రాయపడ్డారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వ అండగా ఉండాలన్నారు. పురపాలిక మాజీ ఛైర్మన్ బొర్రా సుధాకర్, యాదగిరి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పాలడుగు నాగార్జున, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు సైదులు, భిక్షమయ్య, మురళి, సాగర్ పాల్గొన్నారు.

కష్టపడే మనస్తత్వంతో ఏ రంగంలోనైనా రాణించవచ్చు

నల్గొండ కలెక్టరేట్, నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అంకితభావం, కష్టపడే మనస్తత్వం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శిక్షణ పొందిన మహిళా అభ్యర్థుల ముగింపు కార్యక్రమంలో పాల్గొని వారికి ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. జీవితంలో ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తితో జీవించాలని, అయితే ఏ రంగంలోనైనా పోటీ సాధారణమని తెలిపారు. ఈ సందర్భంగా టైలరింగ్ ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందిన 88 మంది మహిళా అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. డీఆర్‌డీఏ శేఖర్‌రెడ్డి, శిక్షణ సంస్థ డైరెక్టర్ రమిపతి పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళా అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

భాజపా బలోపేతం

నకిరేకల్: గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యానాల శంకర్‌రెడ్డి కోరారు. మర్రూరు, గోరెంకలపల్లి, మోదినిగూడెం, నర్సింహాపురం గ్రామాల్లో భాజపా డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు యానాల శ్రీనివాసరెడ్డి, బుడిగె సైదులు, సాయన్న, ఎన్.లక్ష్మయ్య, రాములు, శ్రీకాంత్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్: మర్రూరులో డిజిటల్ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యానాల శంకర్‌రెడ్డి

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

హుండీ ఆదాయం లెక్కింపు

నార్కట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చెర్వుగట్టులోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి గుహాలయంలో బుధవారం 70 రోజుల హుండీ లెక్కింపు నిర్వహించారు. గట్టు కింద ఆలయంలో రూ.7,72,730, గట్టు పైన రూ.24,43,040 మొత్తం ఆదాయం సమకూరినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు.

అన్నదాత మోముల్లో చిరునవ్వు

15 ఏళ్ల అనంతరం తొలిసారిగా..

కనగల్, న్యూస్‌టుడే: రెండేళ్లుగా కరవుతో అల్లాడిపోయిన అన్నదాతలకు ఇటీవల కురిసిన వర్షాలు.. ఏఎమ్మార్పీ నీరు ఊపిరిపోశాయి. నియోజకవర్గంలోని చెరువులు మత్తడి దుంకుతుండటంతో కర్షకుని ఇంట ఆశలు రేకెత్తుతున్నాయి. దీంతో యాసంగి సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో మిషన్ కాకతీయ కింద పూడిక తీయడంతో చెరువుల నీటి సామర్థ్యం పెరిగింది. చెరువుల్లో నీటి నిల్వ ఎక్కువ రోజులు ఉంటుందని సాగు సీజన్ మొత్తం ఏఎమ్మార్పీ నీరు వచ్చే అవకాశం ఉండటంతో రెండు సంవత్సరాల వరకు నీటి సమస్య ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కనగల్ చెరువులోకి వచ్చిన నీరు

నల్గొండ నియోజకవర్గంలో కనగల్‌లో 84, తిప్పర్తిలో 104, నల్గొండలో 98 చెరువులు, కుంటలు ఉన్నాయి. కనగల్ మండలంలో వంద ఎకరాల కంటే ఎక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు 20 వరకు ఉన్నాయి.

కనగల్ చెరువుకు కొనసాగుతున్న ఏఎమ్మార్పీ వరద.. నల్గొండ మండలం నుంచి వచ్చే వరదకు అడ్డుకట్ట వేయడానికి కనగల్ వాగు సమీపంలో నైజాం కాలంలో చెరువు నిర్మించారు. 1800 ఎకరాల విస్తీర్ణం కలిగి, 2600 ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన ఈ చెరువు పదిహేనేళ్ల అనంతరం ఈ ఏడాది పూర్తిగా ఎండిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు వాయిలేరు వాగు ద్వారా ఏఎమ్మార్పీ నీరు వస్తుండటంతో చెరువులోకి గణనీయంగా నీరు చేరుతోంది. ఈ చెరువులో నీరు ఉంటే తేలకంటిగూడెం, చర్లగౌరారం, తిమ్మన్నగూడెం, శేరిలింగోటంతో పాటు దాదాపు 15 గ్రామాలకు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

❖ జి.యడవల్లి ఉత్తర.. దక్షిణం చెరువులు.. చండూరు నుంచి వచ్చే వాగు నీటిని నిల్వ చేయడానికి జి.యడవల్లి వద్ద చెరువు నిర్మించారు. ఈరెండు చెరువుల కింద మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దొరెపల్లి, బుడమర్లపల్లి, బోయినపల్లి, బచ్చన్నగూడెం, మార్తినేనిగూడెం గ్రామాలకు సాగు నీరు అందుతుంది.



మత్తడి దుంకుతున్న జి.యడవల్లి ప్రాజెక్టు

❖ కురంపల్లిలో దాదాపు 700 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ చెరువు మధ్య నుంచే వెళ్తున్నా నీళ్లు మాత్రం రావు. చండూరు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షంతో చెరువు అలుగుపోస్తుంది. దీనికింద 140 ఎకరాల ఆయకట్టు ఉంది. చిన్నమాదారం, దర్వేశిపురం, శేరిలింగోటం చెట్లచెన్నారం, బోయినపల్లి, తదితర చెరువులు పూర్తి స్థాయిలో నిండి అలుగుపోస్తున్నాయి. నల్గొండ మండలం ముషంపల్లి చెరువు కూడా అలుగుపోయడంతో వరి మాత్రమే కాకుండా నిమ్మ, బత్తాయి రైతులు ఆనందపడుతున్నారు.

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని అబ్బాసీ కాలనీలో అంతర్గత మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నాం. కాల్వలు నిర్మించాలి. - జానీమియా, నల్గొండ.

✔ పరిశీలించి కాల్వలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. - అశోక్, డీఈ, నల్గొండ పురపాలిక.

మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు అందజేత

చండూరు, న్యూస్‌టుడే: చండూరులోని గాంధీజీ పాఠశాల ఛైర్మన్ కోడి శ్రీనివాసులు మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ 2024 అవార్డుకు ఎంపికయ్యారు. అందుకు సంబంధించిన అవార్డును హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మంగళవారం తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ వారు నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్, బీసీ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ చేతుల మీదుగా అందుకున్నారు.

చేతి వృత్తుల సంక్షేమానికి ఉద్యమాలు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక సరళీకరణ విధానాలతో చేతివృత్తులు కూనారిల్లిపోతున్నాయని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా నాయకుడు బండ శ్రీశైలం, జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ అన్నారు. నల్గొండలో బుధవారం సంఘం సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాలు పేరుతో రాష్ట్ర, కేంద్రంలో బడ్జెట్ ప్రకటిస్తున్న ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం ఖర్చు చేయడం లేదన్నారు. చేతి వృత్తులను రక్షించుకోవాలంటే సంఘటితంగా ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సీతారాములు, కొండ వెంకన్న, రాచకొండ వెంకన్న, గణేశ్, పెద్దులు పాల్గొన్నారు.

సినిమాలు నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం, **పీవీఆర్:** మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్: **రామకృష్ణ**- విశ్వం, **వెంకటేశ్వర**- దేవర

చిట్యాలలో ప్రతిపక్ష నాయకుల అరెస్టు



చిట్యాల-వట్టిమర్తి మధ్య మాజీ ఎమ్మెల్యే చిరుమర్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చిట్యాల, న్యూస్‌టుడే: రామన్నపేటలో బుధవారం సిమెంట్ ప్రైవేటు పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో చిట్యాలలో ప్రతిపక్ష నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. చిట్యాల-వట్టిమర్తి మధ్య అల్పాహారం కోసం ఆగిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను చిట్యాల ఎస్సై ఎన్.ధర్మా ఆధ్వర్యంలోని పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. చిట్యాల పుర వైస్‌ఛైర్మన్ కూరెళ్ల లింగస్వామి, నాయకులు బొందయ్య, అశోక్ తదితరులు ఉన్నారు. పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామిని చిట్యాలలోని ఆయన ఇంట్లో అదుపులోకి తీసుకుని కట్టంగూరు పోలీసుస్టేషన్‌కు తరలించారు.

నాంపల్లి: అక్రమ అరెస్టులతో ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకానున్న ఆయనను చిట్యాలలో అరెస్టు చేసిన పోలీసులు నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అరెస్టును నిరసిస్తూ నాంపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట నకిరేకల్, నాంపల్లి మండల భారాస శ్రేణులు ఆందోళన చేపట్టారు. ప్రజాభిప్రాయ సేకరణకు స్థానికులను, అఖిలపక్ష నాయకులను రానివ్వకుండా అడ్డుకొని, సంబంధం లేని ఇతర ప్రాంతాల వ్యక్తుల అభిప్రాయం తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరి మద్దతు కూడగట్టాల్సిన ప్రభుత్వం సిమెంటు కంపెనీ నిర్వాహకులతో కుమ్మక్కై అక్రమాలకు ఒడిగడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో భారాస మండల నాయకులు నక్క శేఖర్, బెల్లి సత్తయ్య, బుషిపాక నగేశ్, కర్నె యాదయ్య, ఎల్లయ్య, ఏడుకొండలు, జనార్దన్, గంజి సంజీవ, గౌరు కిరణ్, గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ అర్బన్: ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్తున్న భారాస నాయకులను బుధవారం పోలీసులు ముందుస్తుగా గృహ నిర్బంధం చేశారు. మరికొందరిని స్టేషన్లకు తీసుకెళ్లి సాయంత్రం వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి నివాసంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ ఇతర నాయకులను గృహనిర్బంధం చేశారు.



ప్రతిభ చాటి బహుమతులు గెలిచి

జిల్లా కేంద్రంలోని అక్షర ఉన్నత పాఠశాలలో బుధవారం ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.సుమాంజలి(పదోతరగతి), ద్వితీయ బహుమతి అక్షర(9వ తరగతి), తృతీయ బహుమతి ఎం.గాయత్రి(10వ తరగతి)లు గెలుచుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల వ్యవహర్త పోలోజు నాగేందర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందచేశారు.

–నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే:



పోలీస్ ఆయుధాలపై అవగాహన

నాంపల్లి, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఇందులో పోలీసులు వినియోగిస్తున్న ఆయుధాల పనితీరు, పోలీసు చట్టాలు, షీ టీమ్, భరోసా సెంటర్ సేవలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన పలు విషయాలను ఎస్సై ఎం. శోభన్‌బాబు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



నాంపల్లి : 'ఓపెన్ హౌస్' కార్యక్రమంలో విద్యార్థులకు ఆయుధాల పనితీరు, పోలీసు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శోభన్‌బాబు

మర్రిగూడ: పోలీసు విధులను తెలుసుకొని సమాజ శ్రేయస్సుకు భవిష్యత్తులో తాము కూడా పోలీసులుగా పని చేస్తామంటున్నారు మండల కేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాల విద్యార్థులు. పలు తరగతుల్లోని పాఠ్యాంశంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని రక్షక భట నిలయాన్ని సందర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రంగారెడ్డి స్టేషన్ పరిసరాలు, నేరాలకు సంబంధించిన విషయాలను, సీసీ కెమెరాలు, లాకప్ తదితర ప్రాంతాలను పరిచయం చేసి వాటి వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నరేందర్, సైదులు, వహీద్ ఉన్నారు.

నార్కట్‌పల్లి గ్రామీణ: నార్కట్‌పల్లి పట్టణంలోని పోలీస్ ఠాణాలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్సై క్రాంతికుమార్ ఆయుధాలపై అవగాహన కల్పించారు.

మహిళా సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, న్యూస్‌టుడే: మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. నకిరేకల్ ప్రభుత్వ వైద్యశాల వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. పుర ఛైర్‌పర్సన్ చౌగోని రజిత, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డా.శోభారాణి, మెప్మా ఇన్‌ఛార్జి సీహెచ్.పద్మ తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్: మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

విద్యుత్తు అధికారులకు సన్మానం

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ నల్గొండ సర్కిల్ కార్యాలయంలో జూనియర్ గణాంకాధికారిగా బుధవారం బాబురావు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంఈఎఫ్ ఉద్యోగ సంఘాల నాయకులు స్వాగతం పలికారు. సంఘం రాష్ట్ర బాధ్యుడు వెంకన్న, సైదులు, నర్సింహ, చింత ఎల్లయ్య, యాదగిరి, భిక్షమయ్య, రమేష్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

సగర సంఘం కమిటీ రద్దు

చండూరు, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా సగర సంఘం జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ ప్రకటించారు. చండూరులో జిల్లా అధ్యక్షుడు గంట కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంకు ఆయన హాజరై పలు తీర్మానాలు చేశారు. జిల్లా కమిటీ ఏర్పడి అయిదేళ్ల కాలం పూర్తి అయినందున రద్దు చేస్తున్నట్లు తీర్మానం చేసి ప్రకటించారు. నూతన కమిటీని త్వరలో ఓటింగ్ ద్వారా ఎన్నుకోనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం, రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ కల్లెట్ల మారయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అలేటి శివప్రసాద్, కోశాధికారి దయాసాగర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టు ఎంపిక

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం కబడ్డీ బాలుర జట్టు ఎంపికలను బుధవారం ఎంజీయూలో నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఎంజీయూ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30 నుంచి తమిళనాడులో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొననున్నారు. వర్సిటీ స్పోర్ట్స్‌బోర్డ్ కార్యదర్శి హరీశ్‌కుమార్, కె.అంజిరెడ్డి, శ్రీనివాస్, ఉపేందర్, మురళి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంజీయూ కబడ్డీ జట్టును అభినందిస్తున్న హరీశ్‌కుమార్

క్రీడాకారుల వివరాలు.. మధు, రాకేశ్, కేశవ్, వినోద్‌కుమార్, ఉదయ్, సాయిదీపక్, వేణుగోపాల్, సాయికుమార్, కుమార్, నవీన్, విజయ్, లోకేశ్.



తులసీనగర్ ఆలయంలో నిర్వహించిన అన్నాభిషేకం పూజలో పాల్గొన్న భక్తులు

ఆరుద్ర నక్షత్ర పూజలు

నీలగిరి: ఆరుద్ర నక్షత్రం(పరమ శివుని జన్మ నక్షత్రం) సందర్భంగా బుధవారం స్థానిక తులసీనగర్‌లోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అన్నాభిషేకం పూజలు జరిపించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తే ప్రజలకు అన్నం సమృద్ధిగా లభిస్తుందని వారి నమ్మకం. ఆలయ ఈవో కుశలయ్య, అర్చకులు శివప్రసాద్‌శర్మ, హరీష్‌కుమార్, హనుమంతాచార్యులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతన్న ఆగం

ఫోకస్

నకిరేకల్, గట్టుప్పల, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో తేమ తకరారుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులపై అకాల వర్షం పిడుగుపాటులా మారింది. నకిరేకల్‌లో మంగళవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములతో కురిసిన వర్షానికి పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్ కేంద్రాల్లో పలువురు రైతుల ధాన్యం తడిసిపోయింది. కొందరి ధాన్యం కొట్టుకుపోయి నేలపాలైంది. తడిసిన ధాన్యాన్ని రైతులు బుధవారం ఆరబెట్టుకున్నారు. అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిన విషయంపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని తహసీల్దారు జమీరోద్దిన్ బుధవారం రాత్రి చెప్పడం గమనార్హం.

● రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండల పరిధిలో పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షం రావడంతో పత్తి నేల రాలడంతో పాటు, పత్తి పూత, పిందె కూడా దెబ్బతిన్నది. తేమ సాకుతో ధర కూడా తగ్గించారని, ఇలా అయితే ఆశించిన దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదని స్థానిక రైతులు వాపోయారు.



నకిరేకల్: చీమలగడ్డ పీఏసీఎస్ కేంద్రంలో కొట్టుకుపోయి మట్టిపాలైన ధాన్యం



నకిరేకల్: పట్టాలు చెదిరిపోవడంతో తడిసిన ధాన్యం



మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో వర్షంతో నేలరాలిన పత్తి చేనులో అల్వాల్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

ఆర్థిక సాయం అందజేత.. కనగల్: కనగల్ గ్రామానికి చెందిన బైరగోని శంకర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అకస్మాత్తుగా శంకర్ మరణించడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితుడు సింగం వెంకన్న రూ.50వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. పిల్లలకు మంచి విద్య అందే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

మర్రిగూడ: ఇటీవల దసరా పండగ రోజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండూరు గ్రామపంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జర్పుల బిచ్యానాయక్ కుటుంబానికి బండిశేఖర్ గౌడ్ రూ.11వేలు, మారగోని వెంకటయ్య రూ.10 వేలు, వల్లపు సైదులు రూ.5వేలను బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, కృష్ణ, జహంగీర్, బాలాజీ, మాధవరెడ్డి, సాలార్‌జంగ్ తదితరులు ఉన్నారు.

చిట్యాల: సుంకెనపల్లిలో యాకారి వనజ మరణించారు. దహన సంస్కారాల నిమిత్తం ఆమె భర్త కృష్ణకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆవుల యాదయ్య రూ.10వేలు సాయంగా అందజేశారు.

పుస్తకాల అందజేత.. శాలిగౌరారం: మండలంలోని మనిమద్దె ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి అదే గ్రామానికి చెందిన కొల్లోజు లలిత-చంద్రశేఖర్ దంపతులు రూ.10వేల విలువైన పుస్తకాలను అందజేశారు. మహాత్ముల జీవిత చరిత్రలు, కథలు ఇతర పుస్తకాలను అందించారు. హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, వెంకటాచారి, సహజ, వెంకన్న, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

నియామకం.. నీలగిరి: భాజపా డాక్టర్స్, ఐటీ సెల్ కన్వీనర్‌గా డాక్టర్ వైవీ రాజశేఖర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు.

ఇళ్ల స్థలాల్లో కొనుగోలు కేంద్రం వద్దు.. గట్టుప్పల: తేరట్‌పల్లిలో ఇళ్ల స్థలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయొద్దని ఆ గ్రామానికి చెందిన కొంత మంది రైతులు తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. దీంతో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు 30 ఏళ్ల క్రితం ఇళ్లు లేని నిరుపేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయవద్దని..తమకు ఇళ్ల స్థలాల పట్టాలు గత ప్రభుత్వం అందజేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే సరిహద్దులు చూపకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదని పేర్కొన్నారు. అబ్ధిదారులు తహసీల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి గిర్దావర్ సురేష్‌కు వినతి పత్రం అందచేశారు. ఈకార్యక్రమంలో నర్సింహ, లింగయ్య, అశోక్, ఆగ్రామ మహిళలు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర

మునుగోడు: మునుగోడు మండల కేంద్రంలోని శ్రీకార్తీకేయ, సలాసర్ బాలాజీ కాటన్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రైతులు పత్తిని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. తహసీల్దారు నరేందర్, ఏవో పద్మజా ఉన్నారు.

నాంపల్లి: సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించడం ద్వారా రైతులు మద్దతు ధర పొందవచ్చని తహసీల్దార్ జి.దేవాసింగ్ అన్నారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మర్రిగూడ, చండూరు, కొండమల్లేపల్లిలోని పలు జిన్నింగ్ మిల్లుల పరిధిలో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

మునుగోడు, చండూరు: నల్గొండ జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం చండూరు, నాంపల్లి, మునుగోడు మండలాల్లో ప్రైవేటు పత్తి కొనుగోలుదారులపై దాడులు చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. పలువురిపై కేసులు నమోదు చేసి రూ.13 వేలు జరిమానా విధించినట్లు తూనికల, కొలతల అధికారి శ్రీనివాస్ తెలిపారు.

కేతేపల్లి: సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తిని మద్దతు ధరకే అమ్ముకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం రైతులకు సూచించారు. కొర్లపహాడ్‌లో పత్తి విక్రయాలపై అవగాహన కల్పించారు.



మునుగోడులో కాంటాను పరిశీలిస్తున్న తూనికల, కొలతల అధికారి శ్రీనివాస్

నల్గొండ గ్రామీణం: జిల్లాలో పత్తి కొనుగోలు చేపట్టడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రకటనలో విమర్శించారు. వెంటనే పత్తి క్రయవిక్రయాలు జరపాలని డిమాండ్ చేశారు.

క్రైం రిపోర్ట్

చైల్డ్ హోం నుంచి బాలుడి అదృశ్యం

నల్గొండ నేరవిభాగం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎండీ అయాన్ అనే బాలుడిని గుర్తించిన స్థానికులు పట్టణంలోని చైల్డ్‌హోంకి అప్పగించారు. బుధవారం ఉదయం హోం నుంచి బాలుడు పరారైనట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. చైల్డ్‌హోం ఇన్‌ఛార్జి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

వ్యక్తి అరెస్టు.. రిమాండ్

మునుగోడు, న్యూస్‌టుడే: ఇంటి నిర్మాణ విషయంలో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడి ఓ యువకుడి చావుకు కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అందుకు సంబంధించిన కేసు వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్లో సీఐ వెంకటయ్య విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. మునుగోడు పట్టణానికి చెందిన యసరాని శివ అనే యువకుడు ఈ నెల 15న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మృతిపై అనుమానాలను వ్యక్తం చేస్తూ మృతుడు తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారకులైన పందుల రవితేజను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. సదరు వ్యక్తి నుంచి ద్విచక్ర వాహనం, రెండు చరవాణీలు, రూ.2 వేల నగదును స్వాధీన పర్చుకోని అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్- నల్గొండ-గుంటూరు 565వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన కె.మహేశ్ ద్విచక్రవాహనంపై ఈనెల 12న నకిరేకల్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో తల, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు వివరించారు. బాధితుడు నల్గొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని, కుటుంబీకులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లచ్చిరెడ్డి తెలిపారు.

కేసులు నమోదు

చిట్యాల, న్యూస్‌టుడే: ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలనే డిమాండ్‌తో రామన్నపేటకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామిలను ఎలాంటి నేరాలు జరగకుండా నియంత్రించేందుకు బుధవారం అదుపులోకి తీసుకుని చిట్యాల పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కేసులు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్సై ఎన్.ధర్మా పేర్కొన్నారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

రూ. 10 నాణేలపై అవగాహన

దేవరకొండ, న్యూస్‌టుడే: ప్రజల్లో రూ.10 నాణెంపై అనేక అనుమానాలున్నాయని వాటిని పారద్రోలేందుకు ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ నక్క రాములు బుధవారం పట్టణంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10 నాణేలను ప్రతి ఒక్కరు తీసుకోవాలని అవి చెల్లుబాటు అవుతాయని ఆయన తెలిపారు. వీటిపై పలుఅంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ్ర శ్రీశైలంయాదవ్, గజ్జల వెంకటయ్య, లోకసాని కృష్ణయ్య, సతీష్, వీరారెడ్డి తదితరులున్నారు.


దేవరకొండలో అవగాహన కల్పిస్తున్న దేవరకొండ ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ నక్క రాములు

ఎన్నిక

మిర్యాలగూడ పట్టణం: ఏపీపీసీ మిర్యాలగూడ పట్టణ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా బొల్లేపల్లి మధుమోహనరాజు, మహిళా కన్వీనర్‌గా ప్రణవి, సహాయ కన్వీనర్‌గా అశ్విని, ఉపాధ్యక్షులుగా మల్లేశ్వరి, శ్రీవిద్య, అభి, మధు తదితరులను ఎన్నుకున్నారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని చింతపల్లి బైపాస్ సమీపంలో గత కొన్ని నెలలుగా వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.
— విష్ణు, మిర్యాలగూడ

✔ పగటి వేళలో వీధి దీపాలు బంద్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
— ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ


దేవరకొండ డిపోలో ఆర్టీసీ ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న నల్గొండ డిప్యూటీ ఆర్‌ఎం మాధవి

బహుమతుల ప్రదానం

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ డిపోను రాణీ పొర్రమి, దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ప్రతిభావంతంగా విధులు నిర్వహించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపినందుకు బుధవారం ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం మాధవి వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే దీపావళి పండుగ, శుభకార్యాలు ఉన్న నేపథ్యంలో ఇదే స్ఫూర్తిని కొనసాగించి డిపోను ముందు వరుసలో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ తల్లాడ రమేష్, ఎంఎఫ్ సునీత, వాహిద్, ఉద్యోగులు తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయండి

డిండి, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. బుధవారం డిండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికల) పాఠశాల, ఎంపీడీవో కార్యాలయాలను ఆయన పరిశీలించారు. గురుకుల పాఠశాలలో ఎలుకలు కరిచిన విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ శిరీష, పీఆర్ఏఈ విజయకుమార్, పంచాయతీ కార్యదర్శి జంగయ్య పాల్గొన్నారు.


డిండి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

రెండు వారాలే మిగిలి ఉంది!


మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెంలో ఓటు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు (పాత చిత్రం)

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమానికి మరో రెండు వారాలు మాత్రమే గడువు మిగిలి ఉంది. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో మొత్తం 10 మండలాలు ఉండగా.. గత ఎన్నికల్లో 8 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత ఎన్నికల సమయంలో డివిజన్ వ్యాప్తంగా మొత్తం 1,079 మంది ఓటర్లు ఉండగా.. ఈ సారి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

కేవలం 387 దరఖాస్తులు..

ఓటు నమోదు ప్రక్రియ గత నెల 30న ప్రారంభం కాగా.. బుధవారానికి 24 రోజులు పూర్తి కాగా.. ఇప్పటి వరకు కేవలం 387 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గతంలో మొత్తం వెయ్యికి పైగా ఓటర్లు ఉండగా.. ఓటు నమోదుకు నవంబరు 6 వరకు గడువు ఉంది. కేవలం 14 రోజులు మాత్రమే మిగిలి ఉండగా.. మరో ఏడు వందల మందికి పైగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాధికారి బాలు నాయక్ తెలిపారు.

డివిజన్ పరిధిలోని మండలాల వారీగా బుధవారం వరకు వచ్చిన దరఖాస్తులు..

మండలం	దరఖాస్తులు	2019 ఓటర్లు
అడవిదేవులపల్లి	4	–
అనుముల	19	61
దామరచర్ల	14	31
మాడ్గులపల్లి	8	17
మిర్యాలగూడ	272	788
నిడమనూరు	10	38
పెద్దవూర	21	94
తిరుమలగిరి సాగర్	6	–
త్రిపురారం	24	35
వేములపల్లి	9	15

ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు.


విద్యార్థులతో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

ఈ సందర్భంగా పాఠశాలలో ఎన్ఎంఎంఎస్‌కు సన్నద్ధమవుతున్న 54 మంది విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందజేశారు. ఆయన వెంట ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఎంఈవో రమావత్ నాగేశ్వరరావు, ఎంపీఎంఎస్ ఇన్‌ఛార్జ్ సైదానాయక్, కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, సువర్ణ, జనార్దన్‌రెడ్డి, బాలాజీ, నాగార్జున, సుధాకర్ తదితరులున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని మిర్యాలగూడ రెండో పట్టణ పోలీసులు బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బంగారుగడ్డలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. త్రిపురారం మండలం రూప్లా తండాకు చెందిన పాతులోతు బాలు తన ద్విచక్ర వాహనంపై రెండు బస్తాల పీడీఎస్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిని విచారించగా.. ముట్టుపక్కల ప్రాంతాలలో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి.. రామచంద్రగూడెంలోని ఒక గదిలో నిల్వ ఉంచుతున్నాడని తెలిపాడు. గదిలో నిల్వ ఉంచిన సుమారు 37 క్వింటాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీలో ఎస్సై రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ పట్టణంలోని పాత పౌరసరఫరాల కార్యాలయం నుంచి పర్వతరావు చెరువు వరకు రూ.కోట్ల నిధులతో చేపట్టే సీసీ రహదారి పనులను బుధవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు వార్డుల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని తన దృష్టికి రావడంతో కాలనీవాసుల సమస్యలు తీర్చడం కోసం సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పురపాలిక సంఘం చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్‌చైర్మన్ రహత్‌అలీ, కౌన్సిలర్ పొన్నబోయిన భూదేవి, సిరాజ్‌ఖాన్, జానీయాదవ్, తిరందాసు కృష్ణయ్య, పగిడిమర్రి రాజు, జయప్రకాష్‌నారాయణ పాల్గొన్నారు.

❑ దేవరకొండ పట్టణంలోని త్రిలింగేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి దేవాలయ అభివృద్ధికి కావల్సిన నిధులు కేటాయించి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం ఆయన వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించారు.

రూ.15 కోట్లు మంజూరు.. దేవరకొండ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి ప్రభుత్వం రూ.కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీవో నెం.585 విడుదల చేసినట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. బుధవారం ఆయన దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవరకొండ మండలం ఇద్దంపల్లి నుంచి డిండి మండలం ఎర్రగుంటపల్లి వరకు రూ.2.70కోట్లు, దేవరకొండ మండలం పొంకల్లి నుంచి నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం వరకు రూ.3.15కోట్లు, దేవరకొండ మండలం తూర్పుపల్లి నుంచి కొమ్మేపల్లి వరకు రూ.2.70కోట్లు, డిండి మండలం సింగరాజుపల్లి రోడ్డు నుంచి చందంపేట మండలం వీరన్నగూడెం వరకు రూ.1.35కోట్లు, చందంపేట మండలం కంబాలపల్లి నుంచి యల్మలమంద వరకు రూ.90లక్షలు, చింతపల్లి మండలం తక్కళ్లపల్లి నుంచి యం.మల్లేపల్లి వరకు రూ.4.20కోట్లు మంజూరుచేసినట్లు తెలిపారు. జనవరి నుంచి సన్నబియ్యం అందించనున్నట్లు తెలిపారు. పురపాలిక సంఘం చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, జానీయాదవ్, మాధవరెడ్డి, సంజీవరెడ్డి, రుక్మారెడ్డి, తిరందాసు కృష్ణయ్య, శ్రీనివాస్‌యాదవ్, మాదపాకల సురేందర్, మేకల శ్రీనివాస్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: వరి ధాన్యానికి కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గ్యారకుంటపాలెంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం కావటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీలు నాగయ్య, స్వాగత్ రావు, శ్రీనివాస్‌రెడ్డి, సోమయ్య, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆటోలో గుండెపోటుతో వృద్ధుడి మృతి

కొండమల్లేపల్లిబంధువుల ఇంటికి వెళుతూ మార్గమధ్యంలో ఆటోలో గుండెపోటుకు గురై వృద్ధుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గుర్రంపోడు మండలం జూనూత్ల గ్రామపంచాయతీ గాసీరాం తండాకు చెందిన మేఘావత్ జాను(73) తండా నుంచి ఆటోలో పెద్దపూర మండలంలోని బంధువుల ఇంటికి కొండమల్లేపల్లి చౌరస్తాలో ఆటోలో ఎక్కి కొద్దిదూరం ప్రయాణించగానే ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆటో డ్రైవర్ అప్రమత్తమై ఆటోను ఆపి చూడగా అప్పటికే వృద్ధుడు మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని కొండమల్లేపల్లి పోలీసులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక

చింతపల్లి, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని బుధవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కొడదాటి లక్ష్మణ్ (గొడకొండ్ల), ఉపాధ్యక్షులుగా నల్ల కాశయ్య(సన్నగిల్ల), ప్రధాన కార్యదర్శిగా ఎర్ర కిరణ్(వింజపల్లి), దేవరకొండ ఇన్‌ఛార్జిగా అరెకంటి యాదగిరి, ఎంఎస్ఎఫ్ ఇన్‌ఛార్జిగా నల్ల శ్రీకాంత్‌తోపాటు పలువురిని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఐరిగి శ్రీశైలం, శ్రీనివాస్, నాయకులు వింజమూరి కృష్ణయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి కుర్మేటి వెంకటరమణ, ఎంఎస్ఎఫ్ నాయకులు అరెకంటి యాదయ్య, బుడ్డయ్య, చెన్నయ్య, మసని పెద్దయ్య, నల్ల శంకర్, ఐరిగి శేఖర్, అరెకంటి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. ఏదీ ఇది చదువు



దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ బుధవారం పట్టణంలోని ముత్యాలమ్మబజార్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠనస్థాయిని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిని ఆంగ్ల భాష ప్రావీణ్యతను గమనించి పలు సూచనలు చేశారు.

— న్యూస్‌టుడే, దేవరకొండ

రైతులు సహకరించాలి

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: మండలంలో ఏర్పాటు చేస్తున్న నెల్లికల్ లిఫ్ట్ పైప్‌లైన్ పంట పొలాల గుండా వెళ్తున్నప్పుడు రైతులు సహకరించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం మండలంలోని నెల్లికల్‌లో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. పంట పొలాలకు, రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం పరిహారం అందిస్తుందని తెలిపారు. ఇన్‌ఛార్జ్ తహసీల్దారు అనిల్‌కుమార్, సంబంధిత ఏఈ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

చికిత్స పొందుతూ ఫొటోగ్రాఫర్..

మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని అవంతీపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పొడిశెట్టి నాగయ్య(45) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ నెల 17న కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారిపై అలగడప గ్రామం వద్ద ద్విచక్ర వాహనంపై నాగయ్య వెళ్తుండగా.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ముకుందాపురానికి చెందిన శ్రీశైలం వ్యతిరేక దిశలో ద్విచక్ర వాహనంపై వచ్చి అలగడప గ్రామశివారులో ఢీకొట్టాడు. దీంతో నాగయ్య తల, చేతికి తీవ్ర గాయాలై.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదంపై ఈనెల 18న నాగయ్య భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై పి.లోకేశ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


నాగయ్య

పిడుగుపాటుకు రెండు ఆవులు..

పెద్దఅడిశర్లపల్లి: పిడుగుపాటుకు గురై రెండు ఆవులు మృతిచెందిన ఘటన పీఏపల్లి మండలం పెద్దగట్టులో జరిగింది. ఘటన పట్ల స్థానికుల వివరాలిలా ఉన్నాయి. పెద్దగట్టుకు చెందిన రైతు బాణావత్ చంద్రు తన ఆవులను మంగళవారం మేతమేసి పశువుల పాకలో కట్టేశారు. బుధవారం వచ్చి చూడగా రెండు ఆవులు మృతిచెంది ఉన్నాయి. మంగళవారం రాత్రి కురిసిన పిడుగుపాటు వర్షానికి మృతిచెందాయని రైతు వాపోయారు. ఈ విషయమై బాధితుడు తహసీల్దార్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులకు అవగాహన


త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ జనార్దన్‌గౌడ్


చందంపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌజ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్

త్రిపురారం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగించడంతో కలిగే అనర్థాలు, నష్టాల గురించి విద్యార్థులకు మిషన్ పరివర్తన్‌లో భాగంగా బుధవారం త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో హాలియా సీఐ జనార్దన్‌గౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే సక్రమ మార్గంలో నడవాలని, చెడు అలవాట్లకు బానిసకావద్దని సూచించారు. ఎస్సై ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: పోలీస్ అమరవీరుల దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా అడవిదేవులపల్లి పోలీసుస్టేషన్‌లో ఎస్సై శేఖర్ సిబ్బందితో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనగా.. వారికి ఆయుధాలు, పోలీస్ చట్టాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, డాగ్ స్క్వాడ్ వంటి వాటితో పాటు, ఫింగర్‌ప్రింట్ డివైజెస్, ట్రాఫిక్ పరికరాలు, నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

నాగార్జునసాగర్: పోలీసులు ప్రజలకు మిత్రులలాంటివారని సాగర్ ఎస్సై సంపత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సాగర్ పోలీసుస్టేషన్‌లో స్థానిక వివిధ పాఠశాలల విద్యార్థులకు పోలీసుస్టేషన్ నిర్వహణ, రికార్డులు, పోలీసులు ఉపయోగించే పరికరాలు, ఆయుధాలు గురించి స్థానిక ఎస్సై సంపత్ వివరించారు. సాగర్ సీఐ శ్రీను, సిబ్బంది జావేద్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సిద్దార్థ కళాశాల, కాకతీయ పాఠశాలల్లో రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల్లో ఉన్న పెరుగుతున్న మొబైల్ ఫోన్ వాడకం', 'తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అంశాల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. సీఐ నాగార్జున, ఎస్సై రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

★ మిర్యాలగూడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ నాగార్జున ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు.

చందంపేట: చట్టాల పరిధిలోని అంశాలపై ప్రతి విద్యార్థి, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్సై సతీష్ తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా చందంపేట ఉన్నత పాఠశాల బాలబాలికలకు ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. కొండయ్య, లింగంపల్లి మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ ఐఏఎస్‌ల పర్యటన

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: శిక్షణ ఐఏఎస్‌లు బుధవారం మండలంలోని పెండ్లిపాకల గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరు, లబ్ధిదారుల అభిప్రాయాలు సేకరిస్తూ ఉదయం నుంచి సాయంత్రం దాకా ప్రజల మధ్యలో ఉంటూ సందడి చేశారు.



పెండ్లిపాకలలో శిక్షణ ఐఏఎస్‌లు

ఈ సందర్భంగా వారు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రంను పరిశీలించారు. అనంతరం వారు సమాఖ్యా సంఘాల సభ్యులతో మాట్లాడారు. వారి వెంట జిల్లా సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎంపీడీవో బాలరాజురెడ్డి, మాల్యాద్రి, కార్యదర్శి ధన్‌సింగ్ తదితరులున్నారు.

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండలం రంగారెడ్డిగూడెంలో శిక్షణ ఐఏఎస్‌ల బృందం పర్యటన రెండో రోజు కొనసాగింది. మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఆమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీఎం విజయ ప్రసాద్, సీసీలు అంజయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చింతపల్లి: సివిల్ సర్వీసెస్ (శిక్షణ ఐఏఎస్)అధికారుల బృందం మండలంలోని జర్పులతండాలో మూడో రోజు పర్యటించారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఐఏఎస్‌ల బృందం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ఎంపీడీవో సుజాత, పంచాయతీ కార్యదర్శి కవిత, ప్రధానోపాధ్యాయులు హన్మంత్, అంగన్‌వాడీ ఉపాధ్యాయిని సరిత పాల్గొన్నారు.

కసరత్తు తర్వాతే కలల గృహం అప్పగింత


మిర్యాలగూడ పట్టణ సమీపంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పట్టణంలో పేదలకు పంపిణీ చేసేందుకు నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల పంపిణీకి కసరత్తు జరుగుతోంది. సుమారు ఆరేళ్ల క్రితం పట్టణ సమీపంలో 23 ఎకరాలలో 560 రెండు పడక గదుల ఇళ్లను నిర్మించారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన నాలుగేళ్లకు గతేడాది ఫిబ్రవరిలో ఇళ్ల పంపిణీ కోసం దరఖాస్తులు స్వీకరించారు. పట్టణ వ్యాప్తంగా మొత్తం 12,436 మంది రెండు పడక గదుల ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక అధికారులకు కష్టంగా మారింది. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించి.. గతేడాది మార్చిలో డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. డ్రాలో అవకతవకలు ఆరోపణలతో పాటు రెండు పడక గదుల ఇళ్లలో మౌలిక వసతులు కల్పన నేపథ్యంలో పంపిణీలో జాప్యం జరిగింది. అనంతరం ఎన్నికలు రావడం.. కొత్త ప్రభుత్వ ఏర్పాటు కారణాలతో మరింత జాప్యం చోటు చేసుకుంది.

రంగం సిద్ధం..

మొత్తం ఇళ్లలో స్థలాలు కోల్పోయిన వారికి నేరుగా కేటాయిస్తూ.. మిగిలిన ఇళ్లకు గతేడది డ్రా తీసి 340 మందిని అర్హులుగా గుర్తించారు. ప్రస్తుతం ఇళ్ల పంపిణీ చేసేందుకు సన్నద్ధమవడంతో.. నాటి లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలపై మరోసారి విచారణ చేపట్టి తాజాగా తొలి విడతలో 284 మందికి ఇళ్లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. మిగిలిన 56 మందిలో ఇళ్లు నిర్మించుకున్న వారు 8 మంది, ఒంటరి మహిళలు 29 మంది, చనిపోయిన వారు 4 మంది ఉండగా.. స్థలాల్లేని నిరుపేదలు అందుబాటులో లేని వారు 15 మంది ఉన్నారు. ఒంటరి మహిళలకు ఇళ్లు కేటాయించడంతో పాటు తదుపరి ప్రయోగాలు మారడం, అవివాహిత జోటు చేసుకోవడం వంటి కారణాలతో వారికి కేటాయించడం వీలు కుదిరుతుందనేది సమాచారం.

★ డ్రా ద్వారా తమ పేరు వచ్చినా ప్రస్తుత జాబితాలో తమ పేరు లేని వారు తహసీల్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. తాము పేద వారిమని.. తమకు ఇళ్లు కేటాయించాలని అధికారులను కోరుతున్నారు.

మరోసారి విచారణ చేపడతాం:

హరిబాబు, తహసీల్దారు, మిర్యాలగూడ

భాగంగా గతంలో తీసిన డ్రా లో ఎంపికైన జాబితాలో లబ్ధిదారులను విచారణ చేపట్టి తొలి విడతగా 284 మందిని అర్హులుగా గుర్తించాం. గతంలో పేరు వచ్చి.. ప్రస్తుతం లేని వారిని మరో సారి విచారణ చేసి రెండో విడత జాబితా విడుదల చేస్తాం.

దళారులను ఆశ్రయించొద్దు

చందంపేట, న్యూస్‌టుడే: పత్తిని దళారులను ఆశ్రయించి మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి కేతావత్ లక్ష్మీనాయక్ అన్నారు. ఈ నెల 18న దినపత్రికలో.. దళారుల పాలు ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందించి బుధవారం తెల్‌దేవరపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందన్నారు. పత్తి దిగుబడి సమయంలో వివిధ ప్రాంతాల నుంచి దళారులు గ్రామాల్లో మకాంవేసి మాయమాటలు చెప్పి పత్తి కొనుగోలు చేసే వారిని ఆశ్రయించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రవీణ్‌కుమార్, రైతులు రాములు, దేవ, పాపానాయక్, లక్ష్మానాయక్, నరేందర్, మోతీలాల్ తదితరులు ఉన్నారు.

సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించండి

దేవరకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం పత్తికి మద్దతు ధర రూ.7521 ప్రకటించిందని, రైతులు తాము పండించిన పత్తిని నాణ్యతతో సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు తెలిపారు. బుధవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొండమల్లేపల్లి మండలంలో రెండు జిన్నింగ్ మిల్లులు, పీఏపల్లి మండలంలో రెండు, డిండి మండలంలో 1, చింతపల్లి మండలంలో 4 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు కరణ్‌కుమార్, వేణుకుమార్, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

అవీ ఇవీ

వలిపైరు పరిశీలన.. దామరచర్ల: మండలంలోని కేజేఆర్‌కాలనీ పరిధిలోని ధనావత్ శ్రీహరి వరిపొలాన్ని ఏవో సైదానాయక్ బుధవారం పరిశీలించారు. ముందుగా వరిపొలంలో మోతాదుకు మించి రసాయన మందులు పిచికారీ చేయడంతో రంగు మారినట్లు గుర్తించారు. రెండు రోజుల క్రితం బాధితుడు పురుగుమందుల దుకాణదారుడిపై ఫిర్యాదు చేయగా క్షేత్రపరిశీలన చేశారు. కార్యక్రమంలో వీరనాయక్, కిషన్ నాయక్ తదితరులున్నారు.

ఆందోళన న్యాయమైనదే.. మిర్యాలగూడ పట్టణం: పోలీస్ శాఖలోని ప్రత్యేక బలగాల కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళన న్యాయమైనదేనని.. ఉన్నతాధికారులు ఈ అంశంపై చర్చించి.. వారి సమస్యలు పరిష్కరించాలని మట్టి మనుషుల పోరాట కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. వ్యాప్తంగా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి.. మిర్యాలగూడ పట్టణం: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, లక్ష్మం, కృష్ణయ్య తదితరులున్నారు.

నర్సిరెడ్డిని గెలిపించండి.. చింతపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అల్గుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మడియాగౌరారం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఆంజయ్య ఎమ్మెల్సీ అభ్యర్థిని టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు.

26న విగ్రహావిష్కరణ.. త్రిపురారం: చల్మర్తి మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రామ్మూర్తియాదవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం 26న ఆయన స్వగ్రామమైన పెద్ద దేవులపల్లిలో చేయను న్నట్లు కాంగ్రెస్ మండల నాయకుడు గుండెబోయిన నగేష్‌యాదవ్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, సాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు.

అభినందనలు.. దేవరకొండ: ఈనెల 18 నుంచి 20వరకు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఇండియన్ కామర్స్ అసోసియేషన్ నిర్వహించిన 75వ అఖిల భారత వాణిజ్య సదస్సులో సౌత్‌జోన్ తరఫున ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన దేవరకొండ ఎన్‌ఈర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవినాయక్‌ బుధవారం కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతరులు ఘనంగా సన్మానించారు. విజిత్ భారత్-2024 అనే అంశంపై ప్రిన్సిపల్ రవినాయక్ మాట్లాడారు.

సినిమాలు మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, వెంకటేశ్వర: విశ్వం, శ్రీనివాస: వేట్టయన్
విటల్‌రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక

రైతుల పట్టాలు రద్దు చేయటం సరికాదు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ధరణి రికార్డుల ప్రకారం దామరచర్ల మండలం కొత్తపల్లి శివారు పేరిట ఉన్న పట్టాభూములను కొనుగోలు చేసిన వారి పట్టాలు రద్దుచేయటం సరికాదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా మిర్యాలగూడలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టాదారులు అమిటి రామానుజనేయులు, వింజం మురళయ్య, సాదినేని శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1991 నుంచి పహానీ రికార్డుల ప్రకారం ధరణి పోర్టల్‌లోనే 14.28 ఎకరాలు ముగ్గురు రైతులు తాము ధరణి ప్రకారం పాసుపుస్తకాలు ఉన్నందున నుంచి కొనుగోలు చేశామన్నారు. దీనిపై గత ఆర్డీవోకు ద్వారా బాధ్యులు సర్వే చేయించి హద్దులు కూడా ఏర్పాటు చేసిన న్యాయవాదులు ఎలాంటి నోటీసులు లేకుండా రద్దు చేయటం అన్యాయమని.. దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

★ సాదినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ తన మేనత్త జిమ్మగంగయ్య సైద్యమ్మ వద్ద 2.25 ఎకరాలు పొలం కొంటే ప్రభుత్వ భూమిగా దాన్ని మార్పి రద్దుచేయటం సరికాదన్నారు.